# రుచి

-పిళ్లా మీనాక్షి

## రంజన్ కథనం

కొత్తగా అపాయింట్ అయిందన్నారు. ఆమె పేరు నళిని అన్నాడు అటెండర్ రాజు. తన సీట్లోకి పోయి కూర్చుంటూ భయంపోడానికా అన్నట్లు, తళుక్కున నావేపు చూసిందామె. ఒక మెరుపుతీగె నా లోపలి నుంచి దూసుకుపోయింది. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అని ఊరికే రాయరన్న మాట పుస్తకాల్లో! అలాంటిదేదో నాలో జరిగిపోయింది. బాస్ పిలిచాడు. ఉలిక్కిపడి పరిగెత్తాను.

"ఏం చేద్దామని వచ్చావు? షేక్ హ్యాండ్ చేసుకుందామా?" అన్నాడు. కోపమూ ఉంది, ఇష్టమూ ఉంది. మా జియమ్ చూపుల్లో.

ఫైల్ కోసం పరిగెత్తాను బయటికి. అంతలో, రెక్కల తలుపులు త్రోసుకుని నళిని లోపలికి దూసుకొచ్చింది. రెండు రైళ్లు ఢీకొట్టినట్లే మేం గ్రుద్దేసుకోడం ఖాయం అనుకున్నాను. కళ్లు మూసేసుకున్నాను. పిల్లికూనలా అరక్షణంలో ఇట్లా వొంగొని నా చేతికీ, తలుపుకీ మధ్యన ఉన్న చిన్న పిసరు జాగాలో నుంచి దూసుకుపోయింది. 'లేడిపిల్ల' అంటారు కవులు ఆడపిల్లల్ని ఇందుకే కాబోలు.

చెమట పట్టిన మొహం అద్దుకొని, నా బల్ల దగ్గరికి పోయి ఫైలు తీసుకున్నాను. వెంటనే లోనికి పోతే? అధైర్యంగా ఉంది. 'కావాలనే వీడు డ్యాష్ ఇవ్వబోయాడు' అనుకుందేమో? 'ఉత్త డ్యాష్ గాడు' - అనుకుందేమో....

కానీ, బాస్ అగ్గిరుద్రుడు. నేనూ, ఆ అమ్మాయీ, పట్టాలు తప్పకుండా ఒకే లైన్ మీద, ఇన్ ఆపోజిట్ డైరెక్షన్స్ ఎట్లా వెళ్లామో బాస్ చూశాడా?

"వాడంతేనమ్మా! ఘోటక బ్రహ్మచారిగాడు... జాగ్రత్త..." అంటూ, నళిని భుజం మీద వాత్సల్యం నటిస్తూ - తట్టాడేమో... "ఛ!" అనుకుంటూ, ఫైల్‌తో లోనికి అప్రయత్నంగానే వెళ్లాను.

"ఓ.కే.. స్మార్ట్ గాళ్! యూ కెన్ గో..." అంటున్నాడు జి.ఎమ్.రాఘవరావు.

నా గుండె ఆగిపోయింది. మళ్లీ సేమ్ లైన్‌లోకి వచ్చేస్తోంది ఈ అందాల బండీ.

"సారీ, అండీ!" అంటూ దూసుకుపోయింది, రెక్కల తలుపులు తీసుకుని.

ఆమె వదిలేసిన రెక్కల తలుపులు నా తలకు కొట్టుకుంటాయేమోనన్న భయంతో నళిని గురించి మరి ఆలోచించనేలేదు. నళిని కమ్మని కంఠం ఈ చెవిలో నుంచి, ఆ చెవిలోకి ఉయ్యాలలూగేస్తోంది.

సాయంకాలం అకౌంట్స్ చెక్ చేసి, రిపోర్ట్ చేసేసరికి టంగుటంగుమంది దిక్కుమాలిన 'నైన్‌టీన్ ఫార్టీ సిక్స్ మోడల్ గోడ గడియారం. తలెత్తి చూసేసరికి నళిని లేదు.... 'టైమ్‌కి పారిపోతారు కొత్త అమ్మాయిలు' అనుకున్నాను.

నాలో నాకే నవ్వొచ్చింది.

## నళిని కథనం

ఇంకా నయం ఢీ కొట్టడం జరగలేదు... నేను వెనక్కి పడితే సరిగ్గా అతగాడు నా వొళ్లో పడేవాడు. అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకున్న ఫస్ట్ డేనే 'టాకాఫ్ ది ఆఫీస్' అయిపోయేది.

పాపం! సన్నగా, నాజూగ్గా స్టూడెంట్‌లాగున్నాడు.

"మస్ట్ బి ఏ బ్యాచులర్. రాఘవరావుగారు మా డాడీకి పేకాట క్లబ్‌లో పార్టనర్ కనుక, నాకేం దెబ్బ తగిలేది కాదు. 'దెబ్బ' అంటే నా ఉద్దేశంలో... నా అప్పాయింట్‌మెంట్‌కి, అని....

ఒకవేళ పోకిరీ సరుకేమో... ఆ ఉంగరాల క్రాపింగ్ ఎవర్నైనా అపార్థం చేసుకొనేలా 'చేసుద్దిలే'. అబ్బ! బస్టాండ్‌లో, రైల్లో ప్లాట్‌ఫారమ్ మీద, సిన్మాహాలు ఆవరణలో ఇలాంటి సీనులు బోలెడు జరుగుతాయ్... అయినా, ఈ శాల్తీ నా మనసులో నుంచి పోడేం?...

అతని పేరు తెలీదు. అందాకా ఏ పేరెడదాం అనుకున్నాను. అతను ఈ ప్రక్కల ఎక్కడైనా లేడు కదా?.... అంతలో మా హీరో హోండా వాలా - చిన్న పిసరు (కావాలనే) నా కొంగు రాసుకుపోయాడు. ఆ... దొరికింది. ఈ, నాజూగ్గా ఉన్న అకౌంటెంట్ పేరు, అందాకా 'హీరో హోండా'!

ఉద్యోగం చెయ్యాలి. చదివింది ఎందుకు? అలా అనే కాదు. డాడీ రిటైరైపోయారు. మమ్మీ హెల్త్ 'నాట్ నార్మల్'. సూరిమావగాణ్ని కట్టుకోమంటుంది అమ్మ. వాడికి పదెకరాల మాగాణీ ఉందిట. అక్కడెక్కడో గుడివాడ కాడ... ఆ గోల తప్పించుకుందికే నాకీ ఉద్యోగం.

★★★

నెల తిరిగిపోయింది, ఈ జాబ్ చేస్తూ ఉండి. నన్ను స్టార్‌హోటల్స్‌కి తీసుకుపోయాడు. ఎంత మంచివాడో చెప్పలేను.... ఆఫీసులో అంతా గౌరవిస్తారు ఆయన్ని. తెలియకుండానే, "ఐ లవ్‌యూ!" అని చెప్పవే అంటూ, నా మనసు తొందర చేసింది. కానీ, ఆయనే, మొదట ఆ మాట చెప్పాడు. మమ్మీ, డాడీ ఎవ్వరూ కనబడలేదు నా కళ్లకు ఇంక...

"రంజన్‌గారూ!" అంది నా హృదయం. నా పేరూ, తన పేరూ భలేగా కలిశాయ్.... 'నళినీ రంజన్'. కానీ, కులం మొన్నమొన్నటి వరకూ అడగలేకపోయాను. అది ఇవాల్టి సంస్కారం కాదుగా? కానీ, తెలిసిపోయింది. ఒక్కసారయినా, నాన్‌వెజ్ హోటల్‌కి తీసుకుపోయాడు కాదు - అంటే, మా కొలీగ్ మందిర చెప్పిందే రైటయి ఉంటుంది. 'బేపనోడే' అన్నది అది.

గుండెలు కొట్టుకున్నాయి... మా అమ్మ పీక పిసుకుతుంది. వాళ్ల పేరెంట్స్ ముందే వొప్పుకోరేమో? నా సంగతేమిటి? నాకు బిర్యానీ, కూర్మా, ఫిష్‌కర్రీ... చేపల వెరైటీలు, ఇవన్నీ మహా ఇష్టం!

నాల్రోజులు, అరగంట ముందుగా బయటకొచ్చేశాను, ఆఫీసులోంచి. కానీ, నా తరం కాలేదు నా కాళ్లు అతని 'హోండా' వేపే లాగుతాయి. నా కను

లకు ముందేం కానరాదు.

పెళ్లికి, "ఆర్ యూ రెడీ?" అన్నాడు 'మా హీరోహోండాగారు'.

అమ్మ చెప్పింది. "నీ తిరుగుళ్లు బాగోలేవే! నీ కాబోయే మొగుడు - అంటే, మా పిన్నిగారి కొడుకు - కోపం వస్తే మనిషిగాడు"- అంటూ వార్నింగ్ ఇచ్చింది.

ఉద్యోగం, గిద్యోగం అవసరం లేదు. కూకొని తినడం, తూగు

ట ం



యాల్యాలలో ఊగటం... అంతే... విను మామా మాట... సెడిపోబాకు..." అంటూ హితబోధలు చేసింది.

కానీ, నేను అన్నాను. "మనింట్లో బిర్యానీ తింటే చాలా నీకు? మా పెళ్లికి ఒప్పేసుకుంటావా?" అని.

నాన్నకి కోపం వచ్చింది. ఆడు కులం సెడ్డాడని మమ్మల్ని కులం వొగ్గేయమంటావ్? మాంసం తినకపోతేనే గొప్పోళ్లయిపోరా? ఆళ్ల అమ్మా, నాన్నా నిన్ను మెడబట్టి గెంటేయక పోతే, నా పెళ్లం మీదొట్టు" - అన్నాడు. కానీ, నేను 'హీరో' లేందే బ్రతకలేను.

## రంజన్ కథనం

నాన్నగారు, అమ్మ మంచివాళ్లే. కానీ, నేను నళిని లేకుండా బ్రతకలేనే. నళినిని ఫ్రెండ్స్ సాయంతో హోటల్‌లో పెళ్లి చేసుకుని, వేరే వచ్చేశాను. మీరు దయదల్చి పిలిస్తే మీ కోడలితో కలిసి వస్తాను అని చెప్పేసి, వెనక్కి తిరిగి చూడకుండా వచ్చేశాను. అమ్మ కళ్లల్లో నీళ్లు నేను చూడలేను.


ఆమె ఒక్క కంటి నీటి చుక్క నన్ను దహిస్తుంది. అలా జరిగితే, నళిని బ్రతుకు అవమానం పాలవుతుంది.

"కాపురం పెట్టేద్దామా?" అన్నాను.

"మూడు ముళ్లూ వెయ్యాలి పంతులుగారూ, మొదటా-" అంది. "మూడేం కర్మ మరో మూడు కూడా వేస్తానుగానీ, మా అమ్మ చెప్పింది. బ్రాహ్మలు నాన్ బ్రాహ్మిన్స్‌ని తలంబ్రాల పెళ్లి చేసుకుంటే చెల్లదుట. అందు కని రిజిస్టర్ మ్యారేజికి నేను రెడీ అయ్యాను.

నళిని ఇంతవరకు ఒక్కసారి అయినా, 'మాంసాహారం హోటల్'కి 'పోదాం' అన్లేదు. అంచాత, ఆ బాధ కూడా ఉండదు. ఎప్పటికయినా - నళినే - అమ్మకి అన్ని సేవలూ చెయ్యాలి. నాన్నని ప్లీజ్ చెయ్యగలం అన్న నమ్మకం నాకుంది.


కానీ, ఇంతలో, నళిని ఫాదర్ నళినికి - మా కంపెనీ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.



## చాక్లెట్‌తో ఆరోగ్యం

చాకెట్లవలన ఎన్నో లాభాలున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ చాక్లెట్లు పిల్లలకే కాదు, పెద్దలకు కూడా ఎంతో మేలు చేస్తాయి. చాక్లెట్ వల్ల శరీరానికి ఎక్కువ యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. కొలెస్ట్రాల్ తగ్గించే గుణం యాంటీ ఆక్సిడెంట్లలో ఉంది. చాక్లెట్లలో యాంటీ డిప్రెసెంట్లు ఉంటాయి. అంటే వత్తిడి నుంచి పోరాడే గుణం అన్నమాట. చాక్లెట్ తిన్న వెంటనే మెదడులో ఎండార్ఫిన్స్ అనే రసాయనాలు విడుదల అవుతాయి. అవి మనసును ప్రశాంతంగా ఉంచుతాయని ఓ పరిశోధనలో తేలింది. పని వత్తిడితో అలసిపోయి ఇంటికి వచ్చిన వారికి శరీరం పునరుత్తేజం కావాలంటే ఓ చాక్లెట్ తినేయడమే. కొద్దిసేపటి తరువాత ఉత్సాహంగా, ఉల్లాసంగా పనులు చేసుకోగలుగుతారు. సహజమైన చక్కెర పదార్థాలతో తయారుచేసిన చాక్లెట్లు తింటే పిల్లల పళ్లకు హాని కలగదు.

-కాలిపు శంకరరావు




నళిని నన్ను వదిలి క్షణం ఉండలేదు. అంచేత నా రూటు ఓ పది కిలోమీటర్లు పెరిగింది.

ఆమె ఆఫీసుకే పోయేవాణ్ని. ఈ రోజుల్లో ఇంత మంచి ఫ్రెండ్స్ దొరకడం మా అదృష్టం.

నళిని చెప్పింది నిజమే. "పెళ్లి చేసుకోకుండా ఇంక కలుసుకోకూడదు" అన్నారు.

గెట్ రెడీ అంటూ పెళ్లికి ఏర్పాట్లు చేశారు. చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని, రెడీ చేసుకున్నాం.

### నళిని కథనం

టేపురికార్డర్ 'మంత్రాలు' చదివింది. హోటల్ మీటింగ్ హాలే కళ్యాణమంటపం అయింది.

ఆఫీసు మొత్తం మా బాస్ రాఘవరావుగారితో సహా వచ్చారు. బ్లెస్ చేశారు.

రాఘవరావుగారన్నాడు "పేకాట క్లబ్‌కి వస్తే - మీ నాన్న నా కాళ్లు విరగ్గొడతానన్నాడమ్మాయీ. కానీ, ఈ డాషింగ్ హీరో మొట్టమొదటి రోజునే నీకు 'డాష్' ఇచ్చాడు. నువ్వు 'క్లీన్‌బౌల్డ్' సో.... యూ ఆర్ మ్యాన్ అండ్ వైఫ్..."

స్వీటూ, హాటూ, కూల్‌డ్రింకూ, కేకూ - అన్నింటితో వెడ్డింగ్ పార్టీ 'ఝుమ్మంది.'

కానీ, రంజన్ పంతులుగార్ని అందరూ ఎకసెక్కం చేశారు. "పంతులూ! పప్పన్నం, బూరెముక్కా ఏవీ?" అంటూ.

రీటూ మా స్టెనో. నోటి దురుసుది. "ఫిష్‌కర్రీ అన్నావ్... బిర్యానీ అన్నావ్....నీ ప్రామిస్ ఏదే? నే చెప్పలే? బ్రామిన్స్ అంతేనే... నీకింక పచ్చడిమెతుకులే గతి.

"చూడవే! మా ఇంట్లో మీకు బిర్యానీ వండి పెడతాను." అన్నాను కానీ, అది సాధ్యమా? కానీ, మా పెళ్లయింది. మేం చిన్నసైజు కాపురం పెట్టేశాం.... చాలా హ్యాపీగా ఉంది.

### రంజన్ కథనం

నళిని మంచి పిల్లేగానీ, తిండి పిచ్చి ఎక్కువ. "మటన్ బిర్యానీ లేకపోతే, పోయె - ఆమ్లెట్ అయినా తిందాం-" అంటుంది.

"నాకిష్టం లేదు-" అన్నాను. నేను రోజూ అనే మాటే.

"వో మంచంలో పడుకుంటున్నాం... వో కంచంలో తింటున్నాం. నాన్‌వెజ్ తినడంలో తప్పేమిటి?" అంటుంది. నీకిష్టమే కానీ, నాకు ఆ వాసనే కిట్టదు. మరో కారణం కూడా ఉంది. మనం ఎప్పటికయినా, అమ్మా, నాన్నల దగ్గరికే పోవాలి. మా బామ్మ అనేదంట - "కంచం పొత్తు కుదరుదురా - మంచం పొత్తు కుదురుతుంది గానీ-" అని.

### నళిని కథనం

అయితే, ఇంక మా హీరో హోండా 'పప్పుసుద్ద'గానే ఉండిపోతాడన్న మాట.

కానీ, అతణ్ని వదిలి నేను ఉండలేను - బ్రతకలేను. అందుకే, గుళ్లోకెళ్లి, పూజారి ఎదుట - నా మెళ్లో తాళిబొట్టు కూడా, ఈయన చేత కట్టించుకున్నాను.

రంజన్ అన్నట్లు, ఎప్పటికేనా అత్తమ్మ, మావయ్యగారూ - నా తాళిబొట్టుకు గౌరవం ఇస్తారన్న నమ్మకం ఉంది. నా 'రుచి' కాదు ముఖ్యం - వాళ్ల అభిరుచి ఇంపార్టెంట్.

కానీ, నా వంట - శ్రీమాన్ హోండాగారు - నోట పెట్టలేక పోతున్నారే. హోటల్స్ అంటే, పోష్ హోటల్స్‌కిగానీ రాడాయన. బడ్జెట్ కష్టంగా ఉంది.

రీటా, ఆనాడు రిసెప్షన్‌లో అన్న మాట పట్టుకొని, రోజూ నన్ను సాధిస్తూనే ఉన్నాడు.

"నీకు అంత నాన్‌వెజ్ మమకారమే ఉంటే, ఆ మాగాణీ మామగాణ్నే చేసుకోకపోయావా? కావాలంటే, యూ కెన్ గోటు నాన్ వెజ్ హోటల్స్" అంటూ అటు తిరిగి పడుకుంటాడు.

దీనికి తోడు - నిన్న సాయంకాలం - మార్కెట్ దగ్గర అమ్మ కనిపించింది. ఈయనగారు బండి ఆపి, నన్ను దింపేసి "ఆటోలో వచ్చేయ్. నో హార్డ్‌ఫీలింగ్స్. ప్లీజ్ హర్..." అంటూ వెళ్లిపోయాడు. ఎంత మంచి వాడు....

అమ్మ అంది "ఆ బాపనోడు - పప్పూ, పచ్చడీ పెట్టి నిన్ను ఎండుచేపలా చేస్తున్నాడా... నా మాటిను... మీనాన్నకీ, నీకూ వొండిపెడతాను.... ఎట్టా సిక్కిపోయావో చూడు.... ఇవిగో తాజా సేపలు"

"నేను చాలా హ్యాపీగానే ఉన్నానమ్మా... నీకూ, నాన్నకీ దూరమయ్యాననే బాధ తప్ప..." అన్నాను నేను. అంటూనే కొంచెం దూరంగా జరిగాను నేను అప్రయత్నంగా.

"వాసనొస్తోందేంటి?" సావాస దోసం... అతగాణ్ని కూడా పిలిసి, నోట్లో కుక్కుతా, మటన్ బిర్యానీ... ఏటనుకుంటున్నాడో... ఈ సీతమ్మంటే...." అంది కసిగా.

కానీ, నిజంగానే నాకు నోరూర లేదు. నవ్వేశాను. ఆ తిండి మీద మమకారం పోయింది.

అక్కడే, ఆ రోడ్డు మీదనే - అమ్మా, నేనూ - చెరో దారీ అయి, విడిపోయాం. నా మనసులో ఒక నిర్ణయం మెరిసింది.

'శాకాహారం - వెయ్యి రకాల వంటలూ' అన్న ఒక బుక్ కొనుక్కుని, బ్యాగ్‌లో వడేసుకున్నాను.

## రంజన్ కథనం

పాపం! ఎవరి కులం వాళ్లకి గొప్ప. దాన్నీ, తన బి.సి. స్టాటస్‌నీ, అన్నిటినీ వదిలేసింది నళిని నా కోసం. నేనెందుకు, తన కోసం 'బిర్యానీ ట్రీట్' ఇవ్వకూడదు? నళిని కోసం నేను కూడా తింటాను... అనుకుంటూంటే, నవ్వొచ్చింది. కడుపులో దేవినట్లయింది.

కానీ, 'నిర్ణయం' అంటూ ఒకటి చేశాకా, నేనాగను. అది నా నైజం. తిన్నగా, ఇండో చైనీస్ ఫైవ్‌స్టార్‌కి వెళ్లాను. హాట్ హాట్ మటన్ బిర్యానీ - సిల్వర్ ఫాయిల్‌లో ప్యాక్ చేయించాను.

"మై డాలింగ్ నళినీ! లెటజ్ ఈట్ దిస్ టుగెదర్ - మన ఇంట్లో, మన డైనింగ్ టేబిల్ మీద - టుడే, నో పప్పుసుద్దా..." అంటూ, బైక్ ఎక్కాను. అది పరిగెత్తింది.

## నళిని రంజన్‌ల ముఖాముఖీ

రంజన్: "హాయ్! నీ కోసం ఏం తెచ్చానో చూసుకో..."

నళిని: "హాయ్, డాలింగ్! నీ కోసం ఏం చేశానో చూసుకో....సారీ, చూసుకోండి పొంతులుగారూ!"

రంజన్: "ఓపెన్ సిసేమ్! ఖుల్ జా సిమ్ సిమ్.... టట్టడామ్.. ఇదిగో ఫైవ్ స్టార్ మటన్ బిర్యానీ మిసెస్ నళినీ రంజన్‌గారు! ఆరగించండీ..."

నళిని: (నొచ్చుకున్నట్లు) "ఎంత పని చేశారండీ! నో... నో...

అయ్ డోన్ట్ లైకిట్.... నా మనసంతా నీ మీదే, హీరో హోండా! ఇక దీనిమీదికి పోదు - ఈ లైఫ్‌లో.... నో....నో.... కన్నీళ్లు కావు యివి - ఆనందభాష్పాలు - మైడియర్ సర్.... మీ కోసం ఇదుగో గుత్తివంకాయ కూర.... ఆవ పులుసు... స్వహస్తాలతో చేశాను."

రంజన్: "ఈ ఒక్కసారికీ తిను డియర్.... నా ప్రేమకి పరీక్ష ఇది అనుకున్నాను.... గెలిచాను నళినీ... ఇది నీకు పారితోషికం..."

నళిని: "అవును. నువ్వే గెలిచావ్ - నా డాషింగ్ హీరో! కానీ, నేను నా మాంగల్యం మీదొట్టెట్టుకున్నాను. ఈ జన్మకి నీచు ముట్టను. అంతా కూరగాయల బిర్యానీలే తింటాను. నీకు కూడా- సారీ... మీకు కూడా అవే."

ప్రసన్నంగా లేచి, రంజన్ ఆమెవైపు వాత్సల్యంగా చూస్తూ "పక్కా! నిజం! లాక్‌కియా జాయ్?" అంటూ ఆమె వైపు రాకెట్‌లాగ దూసుకుపోయాడు.

ఆమె కూడా లేచి అతనివైపు దూసుకుపోయింది. వాళ్ల మధ్య రెక్కల తలుపులు లేవు. అక్కడ, ఒకే పట్టాల మీద, అభిముఖంగా వచ్చిన ప్రేమ కెరటాలవి. సైలెంట్‌గా ఢీకొన్నాయి. ఏకమై పోయాయి.

"రుచికన్న అభిరుచి గొప్పది డియర్!" అంటూ మూలిగాయి వాళ్ల మనసులు. ఎందుకంటే, వాళ్ల పెదాలు లాక్ అయిపోయాయి కనుక. ఆ మాటలు మీకు వినిపించే బాధ్యత, ఈ కథను సేకరించి, రాసినందువల్ల నావొంతు అయింది. - దే లివ్‌డ్ హ్యాపీలీ దేరాఫ్టర్....

★



## కారణం ఏమిటి?

తెలుగు చిత్రాలలో నటించడానికి ఎంతోమంది బాలీవుడ్ భామలు ఆసక్తి కనబరుస్తుంటే మల్లికా షెరావత్ మాత్రం 'నో' అనడం ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. 'దశావతారం' తమిళ చిత్రంలోనూ, ఓ కన్నడ చిత్రంలో ఐటమ్ నంబర్ చేయడానికి అంగీకరించిన మల్లిక తెలుగులో మాత్రం నటించడానికి ఎందుకో ఇష్టపడడం లేదట. ఇప్పటికే కొంతమంది ప్రముఖ తెలుగు నిర్మాతలు ఆమెని ఐటమ్ నంబర్ చేయమని అడిగినా, కావలసినంత పారితోషికం ఇస్తామన్నా ఆమె నో అనడానికి కారణం ఏమిటో మల్లిక మాత్రం చెప్పడం లేదు.

